నేడు శ్రీరాంనగర్ ఎన్నికలు

మణికొండ: శ్రీరాంనగర్ (సెక్రటేరియట్) కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం కమ్యూనిటీహాల్‌లో నిర్వహిస్తున్నట్టు ఎన్నికల అధికారులు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ ఉంటుందన్నారు. సాయంత్రం 5 గంటల తర్వాత కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను ప్రకటిస్తామన్నారు. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కోశాధికారి పదవులకు పోటీ అధికం కావడంతో ఎన్నికలు నిర్వహిస్తున్నామని, మిగతా పదవులకు ఏకగ్రీవంగా ఎన్నిక జరిగిపోయిందన్నారు. సంక్షేమ సంఘం ఎన్నికలను కొందరు అభ్యర్థులు ప్రతిష్ఠగా తీసుకుని మున్సిపాలిటీ వ్యాప్తంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, సోషల్ మీడియాలో ప్రచారం పెద్ద ఎత్తున నిర్వహించారు. కాలనీవాసులు ఎవరి సారథ్యాన్ని కోరుకుంటారనే విషయం సాయంత్రం వెలువడనుంది.

'మనీ వైబ్' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో రచయిత ఆనంద్ మెహతా, అతిథులు

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని కోకో రెస్టారెంట్‌లో ఆనంద్‌మెహతా రచించిన 'మనీ వైబ్' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 'ప్యానల్ డిస్కషన్' నిర్వహించారు. ఆనంద్‌మెహతా, మోడరేటర్ ప్రియా రాజీవ్, ప్యానలిస్టులు తాహిర్‌అలీ బేగ్, మాద్వి చంద్రలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గుజరాతీ వ్యాపార విలువల నుంచి నేర్చుకున్న అంశాలను ఆర్థిక స్థిరత్వం, వృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలు, వ్యూహాలను పంచుకున్నారు. ఈ పుస్తకం ఆర్థిక సాధికారతకు రోడ్‌మ్యాప్ లాంటిదని ఇది అన్ని వర్గాల పాఠకులకు అనుకూలంగా ఉంటుందని అన్నారు.

అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి



విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యుత్ సమస్యలపై ఆయన వారితో చర్చించారు. హకీంపేట్ కుంట, టోలిచౌకీ, ప్యారమౌంట్ కాలనీ తదితర ప్రాంతాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తరచూ ట్రిప్ అవుతుందని వీటికి శాశ్వత పరిష్కారం చూడాలన్నారు. టోలిచౌకీ నిజాం కాలనీ, మెరాజ్ కాలనీల్లో లో ఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని దీనిపై తాను గతంలో కూడా అధికారుల దృష్టికి తీసుకొచ్చానన్నారు. అయినా సమస్య అలాగే ఉందన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకొని అధికారులు తమవంతు బాధ్యతగా పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, డీఈ సుధీర్, ఏఈ యూసుఫ్‌బాబా తదితరులున్నారు.

రక్తదాన శిబిరం



గౌలిపురా: ప్రాణపాయ స్థితిలో వ్యక్తిని కాపాడేందుకు రక్తం ఎంతగానో ఉపయోగపడుతుందని భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి అన్నారు. భవానీనగర్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో శనివారం తలాబ్‌కట్టా చాచా గ్యారేజీ సమీపంలో తలసేమియా బాధపడుతున్న రోగులకు రక్తాన్ని అందించేందుకు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఇన్‌స్పెక్టర్ బాలస్వామి పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో పలువురు పాల్గొని రక్తదానం చేశారు

'విద్యా వ్యవస్థను వ్యాపారంగా మార్చొద్దు'

గోల్కొండ: ప్రైవేటు పాఠశాలల వారు విద్యా వ్యవస్థను వ్యాపారంగా మార్చొద్దని గోల్కొండ జోన్ డిప్యూటీ ఈఓ బి.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఆయన టోలిచౌకీ, నానల్‌నగర్ తదితర ప్రాంతాల్లోని ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఫీజు భారంతో ఏ ఒక్క విద్యార్థి కూడా మధ్యలో చదువు ఆపకూడదన్నారు. విద్యా హక్కు చట్టాన్ని కాలరాయకుండా పాఠశాలల యాజమాన్యాలు పక్కా చర్యలు తీసుకోవాలన్నారు. టోలిచౌకీలోని సక్సెస్ స్కూల్‌లో ఆయన ప్రతి తరగతి గదిని సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట సిబ్బంది నజీర్, తిరుపతి తదితరులున్నారు.

మూతలు లేని మ్యాన్‌హోళ్లు.. ప్రమాదాలకు నిలయాలు



హైదర్షాకోట్ ప్రధాన రహదారిపై మూత లేకుండా ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మూతలు లేని మ్యాన్‌హోళ్ల కారణంగా స్థానిక ప్రాంతాల ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎప్పుడు రద్దీగా ఉండే హైదర్షాకోట్ ప్రధాన రహదారిపై డ్రైనేజీ మ్యాన్‌హోల్ గత కొన్ని రోజులుగా మూత లేకుండా ఉంది. ఈ దారిగుండా ప్రయాణించే వాహనాదారులు ఇందులో పడి కిందపడి గాయాలపాలవుతున్నారు. రాత్రి సమయంలో సమస్య మరింత జఠిలంగా మారుతుంది. ఈదారి గుండా భారీ వాహనాలు వెళ్లడంతో తరచూ మ్యాన్‌హోళ్ల మూతలు పగిలిపోయి ప్రమాదభరితంగా మారుతున్నాయని స్థానికులు వెల్లడిస్తున్నారు. ప్రమాదాలను నివారించేందుకు అధికారులు మ్యాన్‌హోల్ మూతలకు మరమ్మతులు నిర్వహించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

కచ్చా మోరీ..చెత్తగా మారి !

శాస్త్రిపురం: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్‌లలోని ప్రాంతాల్లో ఉన్న కచ్చా మోరీలు చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. మోరీలపై పైకప్పులు లేకపోవడంతో స్థానికులు చెత్త వేయడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ముఖ్యంగా పిల్లర్ నెంబర్ 200 వద్ద ఉన్న ఓపెన్ నాలా దగ్గర చెత్త కుండీ ఉండడంతో చెత్తాచెదారం మోరీలో పేరుకుపోతుంది. దీంతో వర్షాలు కురిసినప్పుడు మోరీల్లో నీరు ప్రవహించక బయటకు వస్తుందని స్థానికులు చెబుతున్నారు. కచ్చామోరీలపై పైకప్పులు ఏర్పాటు చేయాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు చర్యలు తీసుకొని మోరీలపై పైకప్పులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



సులేమాన్‌నగర్ ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఓపెన్ మోరీ

అభివృద్ధి పనులు ప్రారంభం

రాజేంద్రనగర్: శివరాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.3 కోట్లతో మౌలిక వసతులను కల్పించేందుకు విర్టుసా మల్టీ నేషనల్ కంపెనీ ముందుకు వచ్చింది. పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పడమటి శ్రీధర్ రెడ్డి చేతులు మీదుగా శనివారం పూజ చేశారు. ప్రస్తుతం గ్రౌండ్ లెవెల్లింగ్, భవనం మొత్తానికి ఐరన్ గ్రిల్స్, పెయింటింగ్ మొదటి విడదతలో చేపట్టింది. ఈ మొత్తం పని జరిగితే కార్పొరేట్ పాఠశాల భవనం మాదిరిగా ఉంటుంది. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సరళమ్మ, ఉపాధ్యాయులు రాజ మహేందర్ రెడ్డి, సుదర్శన్, వెంకటయ్య, నర్సింహా చారి, అంజయ్య పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న కంపెనీ ప్రతినిధులు, పడమటి శ్రీధర్ రెడ్డి తదితరులు

ముష్కి చెరువును పరిరక్షించండి



మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చిన నివాసితులు

మణికొండ: ముష్కి చెరువు పరీవాహకంలో ఉన్న అపార్ట్‌మెంట్‌ల నుంచి మురుగునీరు వచ్చి చేరుతుందని, దీంతో దుర్గంధం, దోమల బెడద పెరిగిపోతుందని మై హోం అవతార్, హాల్‌మార్క్ విసినియా నివాసితులు వాపోయారు. వారు శనివారం మున్సిపల్ మేనేజర్ శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హాల్‌మార్క్ విసినియా నివాసితుడు గౌతంరెడ్డి మాట్లాడుతూ..చెరువు అభివృద్ధి పేరుతో చుట్టు పక్కల ఉన్న మురుగునీటిని చెరువులో కలుపుతూ స్థానికులకు దృవాన్స్ సంస్థ నిర్వాహకులు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నారన్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని తగ్గిస్తూ కట్ట నిర్మాణం చేయడం, చెరువు చుట్టు పక్కల ఉన్న చెట్లను నరికి వేయడం, చెరువులో మురికి నీటిని కలపడం చేస్తున్నారన్నారు. మున్సిపల్, హెచ్‌ఎండీఏ అధికారులు సదరు సంస్థ చేస్తున్న నిర్మాణాలను వెంటనే అడ్డుకుని చెరువును పరిరక్షించటంతో పాటు చుట్టు పక్కల నివాసితుల ఆరోగ్యాలను పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కె. రామకృష్ణారెడ్డి, నాయకులు శ్రావణ్‌కుమార్, నివాసితులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కట్ట మైసమ్మ ఆలయ వార్షికోత్సవాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: భక్తి గీతాలతో బుద్వేల్ ప్రాంతం శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు మారుమోగింది. బుద్వేల్ కట్ట మైసమ్మ ఆలయ 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ ఆవరణలో శుక్రవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమం అనంతరం రాత్రి 11 గంటల నుంచి శనివారం తెల్లవారుజామున 4 గంటల వరకు భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భజన బృందం ఆలపించిన భక్తి గీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ భజన కార్యక్రమంలో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మహాహారతి కార్యక్రమాన్ని నిర్వహించారు.



హారతి తీసుకుంటున్న భక్తులు

నూతన కార్యవర్గం



రాయదుర్గం: మసీదుబండ ఎమ్మార్పీఎస్, ఎంవైఎస్, ఎంఎస్ఎఫ్ నూతన కార్యవర్గాలను శనివారం ప్రకటించారు. మసీదుబండలోని అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం కమిటీహాల్‌లో మసీదుబండ ఎంఆర్‌పీఎస్ సమావేశాన్ని నాయకుడు కొడిచెర్ల ప్రేమ్‌కుమార్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్‌మాదిగ కమిటీలను ప్రకటించారు. ఎంఆర్‌పీఎస్ నూతన అధ్యక్షుడుగా కొడిచర్ల మనోజ్, ఉపాధ్యక్షుడిగా కొడిచర్ల కళ్యాణ్, ప్రధాన కార్యదర్శిగా వినోద్‌కుమార్, కార్యదర్శి బైండ్ల రామకృష్ణ, సహాయకార్యదర్శిగా ప్రశాంత్, ప్రచార కార్యదర్శిగా గండి బన్నీ, గౌరవ సలహాదారు కొడిచర్ల రాము, రామేశ్వరం బాలరాజు, వినోద్, ప్రభాకర్, దర్శన్, నర్సింహ, కార్యవర్గసభ్యులుగా మహేందర్, ధనుష్, నాగరాజును నియమించారు. మాదిగ యువసేన అధ్యక్షుడుగా కొడిచర్ల శ్రీనివాస్, ఎంఎస్ఎఫ్ మాదిగ విద్యార్థి సమాఖ్య గ్రామ అధ్యక్షుడుగా కొడిచర్ల ఆదిత్యను ఎన్నుకున్నారు. కొండాపూర్, శేరిలింగంపల్లి డివిజన్ల ఇన్‌చార్జీ ఐతా రమేష్, బస్తీ నాయకులు రాము, అంజన్న, లక్ష్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరిగా తీసుకోవాలి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని వ్యాపారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్‌లను పొందాలని ఉప కమిషనర్ డాక్టర్ రవి కుమార్ వ్యాపారులకు సూచించారు. సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..సులేమాన్‌నగర్, శాస్త్రిపురం, అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ల పరిధిలోని వ్యాపారులను గుర్తించి ట్రేడ్ లైసెన్స్‌ల కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. వ్యాపారాలు నిర్వహించే వారు తప్పనిసరిగా జీహెచ్‌ఎంసీ నుంచి ట్రేడ్ లైసెన్స్‌లు పొందాలన్నారు. ఇందుకోసం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే ట్రేడ్ లైసెన్స్‌లను జారీ చేస్తున్నట్లు తెలిపారు. ట్రేడ్ లైసెన్స్ ద్వారా వ్యాపారులు తమ వ్యాపారాన్ని మరింత విస్తృత పరిచేందుకు అవకాశం ఉంటుందన్నారు. జూలై నెల నుంచి ట్రేడ్ లైసెన్స్ లేని వారిని గుర్తించి అపరాధ రుసుం విధిస్తామన్నారు. ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకునేందుకు జీహెచ్‌ఎంసీ కార్యాలయాన్ని సంప్రదించాలని..లేదా తమ వద్దకు వచ్చే రెవెన్యూ సిబ్బందిని సంప్రందించాలన్నారు.

ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తి అరెస్టు

శంషాబాద్ రూరల్: ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఊట్‌పల్లిలో ఉన్న డైమండ్ ఎస్టేట్ కాలనీలో తారకేశ్వర్ తన కుటుంబసభ్యులతో కలిసి ఉంటున్నాడు. ఇతనికి ఖైనీ, గుట్కా నమలడం అలవాటు ఉంది. ఈ క్రమంలో కొన్ని నెలల నుంచి వీటిని అతను ఓఆర్‌ఆర్ వంతెన వద్ద కొంత మంది ద్వారా కొనుగోలు చేస్తున్నాడు. వాటితో పాటు వారు ఇతనికి గంజాయిని కూడా విక్రయించారు. గంజాయిలో విత్తనాలు కనిపించగా..వాటిని తన ఇంటి ఆవరణలో కూరగాయాలతో పాటు పెంచుతున్నాడు. ఈ విషయాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అతన్ని ఇంటికి వెళ్లి విచారణ చేయడంతో గంజాయి మొక్కలు కనిపించాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బుతో ఉడాయించిన వ్యక్తిపై ఫిర్యాదు

రాజేంద్రనగర్: ఆన్‌లైన్ క్యాష్ ట్రాన్స్‌ఫర్ చేసుకొని ఉడాయించిన నేరస్తుడి కోసం రాజేంద్రనగర్ పోలీసులు గాలిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం..కిస్మత్‌పూర్‌లో ఓ వ్యక్తి తన చిల్లర దుకాణంలోనే ఆన్‌లైన్ మనీ ట్రాన్స్‌ఫర్‌ను చేస్తుంటాడు. శుక్రవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి (30) ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ ద్వారా రూ.75 వేల నగదు కావాలని కోరాడు. డబ్బులు అర్జెంట్ ఉందని..రూ.5 వేలు అదనంగా ఇస్తానని తెలిపాడు. దీంతో దుకాణ నిర్వాహకుడు డబ్బును గుర్తు తెలియని వ్యక్తికి ఇచ్చాడు. ఆన్‌లైన్ పేమెంట్ చేస్తానంటూ అతన్ని మాటల్లో దింపి అక్కడి నుంచి జారుకున్నాడు. దీంతో బాధితుడు రాజేంద్రనగర్ పోలీసులను ఆశ్రయించాడు. సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు నిందితుడు హిమాయత్‌సాగర్‌కు చెందిన పాత నేరస్తుడిగా గుర్తించారు. నిందితుని కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తాం

బండ్లగూడ: ప్రభుత్వ పాఠశాలలను అధునాతన పద్ధతిలో అభివృద్ధి చేస్తామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. హైదర్షాకోట్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్, రౌండ్ టేబుల్ సంస్థల వారు నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..త్వరలోనే ఈ అదనపు తరగతి గదులను ప్రారంభించడంకానున్నాయన్నారు. విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో 16వ డివిజన్ ఇన్‌చార్జి టింకురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి

సెల్ టవర్ నిర్మాణ పనులు నిలిపివేయాలి



రాజేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

బండ్లగూడ: సెల్ టవర్ నిర్మాణ పనులను నిలిపివేయించేలా చర్యలు తీసుకుంటామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. 3వ డివిజన్ శాంతినగర్ ఫేజ్–2 శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వెనుక వైపు చేపడుతున్న సెల్ టవర్ నిర్మాణ పనులను నిలిపివేయించాలని కాలనీవాసులు శనివారం ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజలకు అసౌకర్యాలు కలిగే పనులను గుర్తించి వాటిని నిలిపివేస్తామన్నారు.

వీధి దీపాలకు మరమ్మతు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఎట్టకేలకు వీధి దీపాలకు మరమ్మతులు ప్రారంభమయ్యారు. కొత్త వీధి దీపాలతో పాటు చిన్నపాటి మరమ్మతులకు నోచుకోక అనేక వీధి దీపాలు వెలగడం లేదు. జీహెచ్‌ఎంసీ ఈ కాంట్రాక్ట్‌ను మార్చడంతో ప్రస్తుతం మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. బుద్వేల్ కిష్టమ్మ గుట్ట మీదుగా కిస్మత్‌పూర్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై గతంలో వీధి దీపాలను ఏర్పాటు చేశారు. ఈ వీధి దీపాలకు మరమ్మతులు లేకపోవడంతో ప్రస్తుతం వెలగడం లేదు. ఈ ప్రధాన రహదారి కావడంతో రాత్రి సమయంలో చిమ్మ చీకటి ఏర్పడుతుంది. ఈ రహదారిపై గతంలో అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. వీధి దీపాల నిర్వహణ లేక వీధి దీపాలకు చెట్ల తీగలు అల్లుకొని స్తంభంతో పాటు వీధి దీపం సైతం కనిపించకుండా మారాయి. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ రహదారిపై జీహెచ్‌ఎంసీ వీధి దీపాల నిర్వహణ సిబ్బంది ప్రత్యేక లాడర్‌తో మరమ్మతులను చేపట్టారు. వీధి దీపాలను ఒక్కొక్కటిగా పరిశీలిస్తూ మరమ్మతులు చేశారు. వెలగని వీధి దీపాలు తొలగించి కొత్తవి వేశారు. అలాగే అల్లుకుపోయిన తీగలను తొలగించారు.



వీధి దీపాలకు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

నాసిరకం పనులతో ప్రజాధనం వృథా



పనులను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో ఇంజినీరింగ్ పనుల్లో నాణ్యత లోపించటంతో ప్రజాధనంవృథా అవుతుందని బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం ఆరోపించారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని ఫ్రెండ్స్ కాలనీలో పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత డిసెంబర్‌లో ఫ్రెండ్స్ కాలనీలో వేసిన రోడ్లు, మ్యాన్‌హోళ్లు అప్పుడే పాడైపోవడంపై ఉన్నతాధికారులు విచారణ చేయాలన్నారు. ఇకనైనా అధికారులు పనుల నాణ్యతపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, ఉపాధ్యక్షుడు ఎ.లక్ష్మణ్‌రావు, నాయకులు బి.బాబు, బాబురావు, శ్రీకాంత్, కిరణ్, భానుచందర్, ఆరీఫ్, సుమనళిని పాల్గొన్నారు.

• నృత్య నీరాజనం

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం చెన్నైకి చెందిన భరతనాట్య కళాకారిణి స్మితి విక్రమ్ పుష్పాంజలి, మయూర అలరిపు, శివస్తుతి, అభంగ్, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు. శ్రీనృత్య అకాడమీ గురువు ప్రత్యూష శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు. స్వర పల్లవి, వినాయకకౌతం, ఇందరికి అభయములిచ్చు, భజమానస, రామాయణశబ్దం, జయము జయము, జతిస్వరం, తిల్లాన తదితర అంశాలను కళాకారులు శివాని, సాన్వితసాయి, సాత్విక, అనన్యసాయి, అపూర్తి, సాన్విక, శ్రీజీవిత, హంసిక, సహస్ర, ద్రితి, నిత్య నేహ, ఐశ్వర్య, హసవిత, దుర్గ, హిమశ్రీ తదితరులు ప్రదర్శించారు.

అన్నమయ్యపురంలో..

అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం తేజస్వీ నృత్యాలయ నృత్య నీరాజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువు దివ్య తేజస్వీ శిష్య బృందం మహాగణపతిం, గురుబ్రహ్మా, గురువిష్ణు, భావములోన, ఒకపరి ఒకపరి, జగడపు, అదిగో అల్లదిగో, ఎందరో మహానుభావులు కీర్తనలకు కళాకారులు వేదశ్రీ, అక్షితరెడ్డి, అర్షితరెడ్డి, రుత్విక, లౌక్య, రియాన్షి, వైష్ణవి, ధృవి, అదితి, లీజ, నిత్య, రమ్యకృష్ణ, భవాని, సుదేక్ష, మోనికాసాయి మానస, అంచల్‌సింగ్ తదితరులు ప్రదర్శించారు. అనంతరం కళాకారులను వ్యవస్థాపకురాలు డాక్టర్ శోభారాజు, సంస్థ మేనేజింగ్ ట్రస్టీ నందకుమార్‌లు సత్కరించారు.



అన్నమయ్యపురంలో





శిల్పారామంలో..

ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న గాజుల అంజయ్య, మధుసూదన్ యాదవ్, హన్స్‌రాజ్

చార్మినార్: బోనాల ఉత్సవాల సందర్భంగా శనివారం మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో వీర హనుమాన్ భక్త సమాజం కమిటీ ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ బస్తీలో బోనాల ఉత్సవాల ప్రారంభానికి ముందు మీరాలం మండి అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందని కమిటీ ప్రతినిధులు ఎస్.సాయికుమార్, రాంకుమార్, సురేష్, చిన్న, జేరిపోతుల సాయి పవన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్యను ఘనంగా సన్మానించారు. మల్యాల మధుసూదన్‌యాదవ్, అనంతోజీ హన్స్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.